సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం
శుక్రవారం : 10 : మార్చి : 2023



ఉద్యోగుల సంక్షేమానికి పెద్దపీట
ఉద్యోగుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్ద పీట వేస్తోందని రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ అన్నారు. 10లో



ఏజెన్సీపై చిన్నచూపా ?
ఏజెన్సీ ప్రాంతాల నుంచి హైదరాబాద్, రాజమండ్రి, గుంటూరు వెళ్లేందుకు బస్సులు లేక ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. 8లో

గరిష్టం / కనిష్టం
37° / 20°

వాతావరణం
జిల్లాలో శుక్రవారం పగటి ఉష్ణోగ్రత అధికంగానే ఉంటుంది. రాత్రి, తెల్లవారుజామున కొంత చలి ప్రభావం ఉంటుంది.

న్యూస్‌రీల్

వైభవంగా రామయ్య నిత్య కల్యాణం



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

భద్రాచలం: భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామి వారి నిత్యకల్యాణ వేడుక గురువారం వైభవోపేతంగా జరిగింది. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో స్వామివారిని కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. స్వామి వారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు.

శ్రీ బాలాజీ ఆలయంలో సుదర్శన హోమం



సుదర్శన హోమం నిర్వహిస్తున్న అర్చకులు

అన్నపురెడ్డిపల్లి: మండల కేంద్రంలో కొలువుదీరిన శ్రీబాలాజీ వేంకటేశ్వరస్వామి వారి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం సుదర్శన హోమం నిర్వహించారు. అంతకుముందు స్వామివారికి సుప్రభాతసేవ, ఆరాధన, బాలభోగ నివేదన, తీర్థ ప్రసాద గోష్టి, బలిహరణం, ఉంజల్‌సేవ, దీపోత్సవం తదితర కార్యక్రమాలను గిరిధరాచార్యుల ఆధ్వర్యంలో అర్చకులు వైభవంగా జరిపించారు. కార్యక్రమంలో ఆలయ మేనేజర్ వెంకటరమణ, మాజీ చైర్మన్ వనమా గాంధీ, కాశ్లూరి శివరాజు తదితరులు పాల్గొన్నారు.

15న వాహనాల వేలం

సింగరేణి(కొత్తగూడెం): జిల్లాలోని అన్ని పోలీసు స్టేషన్లలో వివిధ కేసుల్లో సీజ్ చేసి, కాలం చెల్లిన 17 వాహనాలను వేలం వేయనున్నట్లు జిల్లా మోటారు వాహనాల రవాణాధికారి సోములు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్పీ సునీల్‌దత్ ఆదేశాల మేరకు జిల్లాలోని అన్ని స్టేషన్లలో ఉన్న వాహనాలను హేమచంద్రాపురంలోని పోలీస్ హెడ్ క్వార్టర్స్‌కు తరలిస్తామని, అక్కడే వేలం వేస్తామని పేర్కొన్నారు. ఇందులో నాలుగు చక్రాల వాహనాలు ఆరు, ఆటోలు ఆరు, ద్విచక్ర వాహనాలు ఐదు ఉన్నాయని వివరించారు. వేలంలో పాల్గొనదల్చిన వారు 8328155478 నంబర్‌కు ఫోన్ చేసి వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు.

ముగ్గురు సీఐల బదిలీ

సింగరేణి(కొత్తగూడెం): జిల్లాలో ముగ్గురు సీఐలను బదిలీ చేశారు. ఈమేరకు ఐజీ కార్యాలయం నుంచి గురువారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. కొత్తగూడెం వన్ టౌన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ బత్తుల సత్యనారాయణ ఖమ్మం త్రీటౌన్‌కు బదిలీ అయ్యారు. అలాగే, డీసీఆర్బీ సీఐ డి.వేణుచందర్‌ను భూపాలపల్లి జిల్లాకు, జిల్లా డీఎస్‌బీ(డిస్ట్రిక్ట్ స్పెషల్ బ్రాంచి) సీఐ టి.స్వామిని ఖమ్మం వన్‌టౌన్‌కు బదిలీ చేశారు. అయితే, వీరి స్థానాల్లో ఇంకా ఎవరినీ నియమించలేదు.

రాఘవ కన్‌స్ట్రక్షన్స్‌కు 'సీతారామ' పనులు !

సాక్షిప్రతినిధి, ఖమ్మం: ఉమ్మడి ఖమ్మం జిల్లాకు సాగునీరు అందించేలా నిర్మిస్తున్న సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్(ఎస్‌ఆర్‌ఎల్‌ఐపీ) 13వ ప్యాకేజీ పనులను రాఘవ కన్‌స్ట్రక్షన్స్ కంపెనీ దక్కించుకుంది. ఈ ప్యాకేజీ పనుల అంచనా విలువ రూ.301.45 కోట్లు కాగా 0.99 శాతం లెస్(రూ.298.47 కోట్లు)తో రాఘవ కన్‌స్ట్రక్షన్స్ పొందింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూలూరుపాడు మండలం పాపకొల్లు నుంచి ఖమ్మం జిల్లా ఏన్కూరు మండలం బురదరాఘవాపురం వరకు 11.9 కిలోమీటర్ల మేర పనులు చేయాల్సి ఉంటుంది. పాలేరు లింక్ కెనాల్ పనులు పాపకొల్లు నుంచి ప్రారంభమవుతాయి. ప్రధాన కాల్వ తవ్వడంతో పాటు సీసీ లైనింగ్ పనులన్నీ ఈ ప్యాకేజీలో భాగంగా చేయాల్సి ఉంటుంది. అయితే ఈ పనుల కోసం బీవీఎస్‌ఆర్ కన్‌స్ట్రక్షన్స్ ప్రైవేట్ లిమిటెడ్ అంచనా విలువ కన్నా 4.95 శాతం(రూ.316.37 కోట్లు) ఎక్కువగా టెండర్ దాఖలు చేసింది. అలాగే హెచ్‌ఈఎస్ ఇన్‌ఫ్రా ప్రైవేట్ లిమిటెడ్ అంచనా విలువ కన్నా 4.5 శాతం(రూ.315.02 కోట్లు) ఎక్సెస్‌తో ఆన్‌లైన్ టెండర్ దాఖలు చేశారు. కాగా, ప్రభుత్వం గురువారం ఆన్‌లైన్ టెండర్లను తెరవగా అంచనా ధర కన్నా తక్కువకు కోట్ చేసిన రాఘవ కన్‌స్ట్రక్షన్‌కు పనులు దక్కాయి.

ఇక పరోక్ష సేవలు..



భద్రాద్రి శ్రీ సీతారామచంద్రస్వామి వారి ఆలయం

ఆలయానికి రాలేని భక్తుల గోత్రనామాలతో కల్యాణం

- పోస్టల్, కార్గో ద్వారా ముత్యాల తలంబ్రాల పంపిణీ
- ఆన్‌లైన్‌లో బ్రహ్మోత్సవాల టికెట్లు
- ప్రత్యక్షంగా కొనుగోలుకూ కౌంటర్ల ఏర్పాటు

భద్రాచలం: భద్రాచలంలో జరిగే శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని ప్రత్యక్షంగా వీక్షించాలని, స్వామి వారి తీర్థ ప్రసాదాలు, తలంబ్రాలు స్వీకరించాలని ప్రతీ భక్తుడి కోరిక. కానీ వయోభారం, ఇతర కారణాలతో రాలేని వారికి ఆలయం నుంచి బృహత్తర అవకాశాలు కల్పిస్తున్నారు. టెక్నాలజీ, రవాణా వ్యవస్థను వినియోగించి భక్తులకు పరోక్ష సేవలు అందించాలని నిర్ణయించారు. పోస్టల్, కార్గో సర్వీసుల ద్వారా ఇంటివద్దకే తలంబ్రాల పంపిణీతో పాటు కల్యాణం, సామ్రాజ్య పట్టాభిషేక మహోత్సవాల్లో భక్తుల గోత్రనామాలతో పూజలు, ఆన్‌లైన్‌లో సెక్టార్ టికెట్ల విక్రయం వంటి పలు అవకాశాలను అందుబాటులోకి తెచ్చారు.

ఇంటికే ప్రసాదం..

శ్రీరామనవమి, పట్టాభిషేక మహోత్సవాలకు హాజరు కాలేని భక్తులకు గతేడాది నుంచే పరోక్ష సేవలు ప్రారంభించారు. వీటికి విశేష ఆదరణ లభించగా ఆలయానికీ ఆదాయం సమకూరింది. దీంతో ఈ ఏడాది కూడా పరోక్ష సేవలను కొనసాగిస్తున్నారు. రూ.5వేలు, రూ.1,116 టికెట్లను www. bhadrachalamonline. com వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచారు. టికెట్ కొనుగోలు చేసిన భక్తుల గోత్రనామాలతో ఈనెల 30, 31 తేదీల్లో జరిగే శ్రీరామనవమి, పుష్కర సామ్రాజ్య పట్టాభిషేం మహోత్సవాల సందర్భంగా ప్రత్యేక పూజలు చేస్తారు. రూ.5 వేలు చెల్లించిన భక్తులకు స్వామివారి మూలవరుల శాలువా, జాకెట్ పీస్, కుంకుమ, తలంబ్రాలు, ప్రసాదాలను పోస్టల్ లేదా కొరియర్ ద్వారా అందజేస్తారు. రూ.1,116 చెల్లించిన వారికి స్వామి వారి కల్యాణ కండువా, జాకెట్ ముక్క, కుంకుమ, తలంబ్రాలు, ప్రసాదాలను పంపిణీ చేస్తారు. ఇక ఆలయంలో జరిగే వివిధ అభివృద్ధి పనులు, సేవలు, కాటేజీల నిర్మాణం నిమిత్తం రూ.50 లక్షలు పైగా విరాళం సమర్పించిన దాతలకు ఆదాయ పన్ను మినహాయింపుతో పాటు పదేళ్ల పాటు 1 సీ సెక్టార్‌లో కూర్చుని కల్యాణం, పట్టాభిషేక మహోత్సవాలను వీక్షించే అవకాశం కల్పిస్తారు. రూ.25 లక్షలకు పైగా విరాళం అందజేసిన వారికి రెండు సంవత్సరాల పాటు ఫ్లవర్ బ్యాడ్జీని ఉచితంగా అందజేస్తారు.

రూ.30 చెల్లిస్తే ముత్యాల తలంబ్రాలు..

శ్రీరామనవమి ఉత్సవాల్లో సీతారాముల తలపై జాలువారిన తలంబ్రాలను పొందాలని ప్రతీ భక్తుడి ఆశ. ఉత్సవాలకు హాజరు కాలేకపోయిన భక్తులకు ముత్యాల తలంబ్రాలు అందించాలని ఆలయ అధికారులు భావించారు. ఇందుకోసం రూ.30 చెల్లిస్తే రెండు ముత్యాలు గల తలంబ్రాల ప్యాకెట్‌ను పోస్టల్ లేదా ఆర్టీసీ కార్గో సర్వీసుల ద్వారా అందజేస్తారు. అయితే రవాణా చార్జీలు అదనంగా చెల్లించాల్సి ఉంటుంది. స్వామి వారి లడ్డూ ప్రసాదాలను సైతం అందజేయాలని ఆయా శాఖల అధికారులు ప్రణాళికలు రూపొందిస్తున్నారు.

ఆన్‌లైన్ టికెట్లకు ఆదరణ..

శ్రీరామనవమి, పుష్కర సామ్రాజ్య పట్టాభిషేకం వేడుకల్లో ప్రత్యక్షంగా పాల్గొనేందుకు ఇప్పటికే ఆన్‌లైన్ ద్వారా టికెట్లు విక్రయిస్తున్నారు. ఈ సేవలకు భక్తుల నుంచి విశేష ఆదరణ లభిస్తోంది. శ్రీరామనవమికి సంబంధించి రూ.7,500 ఉభయదాతల టికెట్లతో పాటు రూ.2,500, 2,000, 1,000, 300, రూ.150 విలువైన సెక్టార్ టికెట్లు, పట్టాభిషేకానికి రూ.1,500 విలువతో ఇద్దరికి అనుమతి గల టికెట్లు అందుబాటులో ఉన్నాయి. ఆయా టికెట్లను ప్రత్యక్షంగా విక్రయించేందుకు కొత్తగూడెం, భద్రాచలం ఆర్టీఓ కార్యాలయాలతో పాటు భద్రాచలంలోని దేవస్థానం, సీఆర్‌ఓ కార్యాలయం, బ్రిడ్జి పాయింట్ వద్ద గల సీఆర్‌ఓ కార్యాలయాల్లో గురువారం ప్రత్యేక కౌంటర్లు ప్రారంభించారు.



భక్తులకు మరింత చేరువగా..



పరోక్ష సేవలతో భక్తులకు రామయ్య సేవలు మరింత చేరువవుతాయి. బ్రహ్మోత్సవాలకు హాజరు కాలేని సుదూర ప్రాంత భక్తుల కోసం పలు విధాలైన సేవలను అందుబాటులో ఉంచాం. వీటిని భక్తులు సద్వినియోగం చేసుకుని స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరుతున్నాం.

– రమాదేవి, రామాలయ ఈఓ

'పది' పరీక్షలే కీలకం

కలెక్టర్ అనుదీప్



మాట్లాడుతున్న కలెక్టర్ అనుదీప్

సూపర్‌బజార్(కొత్తగూడెం): విద్యార్థుల జీవితాల్లో పదో తరగతి పరీక్షలకు ఎంతో ప్రాముఖ్యత ఉంటుందని, వారికి ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ అనుదీప్ అధికారులను ఆదేశించారు. పరీక్షల ఏర్పాట్లపై ఐడీఓసీలో పలు శాఖల అధికారులతో గురువారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. జిల్లాలో 12,962 మంది విద్యార్థులు పరీక్షలు రాసేందుకు 72 కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఏప్రిల్ 3 నుంచి 13 వరకు పరీక్షలు జరుగుతాయన్నారు. 72 సిట్టింగ్ స్క్వాడ్‌లు, డిప్యూటీ తహసీల్దార్లు, ఎస్‌ఐలతో అయిదు ఫ్లయింగ్ స్క్వాడ్‌లు ఏర్పాటు చేస్తూ ప్రొసీడింగ్‌లు జారీ చేయాలని డీఆర్‌ఓకు సూచించారు. అన్ని కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించాలని, సమీపంలో జిరాక్స్ సెంటర్లను మూసేయాలని చెప్పారు. మన ఊరు, మన బడి మరమ్మతులు జరుగుతున్న పాఠశాలల్లో పరీక్షల నిర్వహణకు ఇబ్బందులు రాకుండా చూడాలని డీఈఓకు సూచించారు. మారుమూల ప్రాంతాల విద్యార్థులు సకాలంలో పరీక్ష కేంద్రాలకు వచ్చేలా బస్సులు ఏర్పాటు చేయాలని ఆర్టీసీ అధికారులను ఆదేశించారు. ప్రాథమిక చికిత్స కేంద్రాలు, తాగునీరు, పారిశుద్ధ్య కార్యక్రమాలు, మరుగుదొడ్ల నిర్వహణ తీరును పర్యవేక్షించాలన్నారు. దివ్యాంగులకు ప్రత్యేక గదులు కేటాయించాలని చెప్పారు. సలహాలు, సూచనల కోసం డీఈఓ కార్యాలయంలో కంట్రోల్ రూం ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ కె.వెంకటేశ్వర్లు, డీఈఓ సోమశేఖరశర్మ, డీఎంహెచ్‌ఓ శిరీష, ఎంవీఐ జయపాల్‌రెడ్డి, ఏఆర్ డీఎస్పీ విజయబాబు, విద్యుత్ డీఈ వెంకటరత్నం, పోస్టల్ శాఖ అసిస్టెంట్ సూపరింటెండెంట్ రజత్‌కుమార్ చౌదరి పాల్గొన్నారు.

ఇసుక రీచ్‌లకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలి

నూతన ఇసుక రీచ్‌ల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కలెక్టర్ అనుదీప్ మైనింగ్, భూగర్భ జలశాఖ అధికారులకు సూచించారు. ఐడీఓసీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రాజెక్టుల నిర్మాణానికి అవసరమైన భూసేకరణ ప్రక్రియను సత్వరమే పూర్తి చేయాలన్నారు. పెండింగ్ అంశాలపై ఆర్డీఓలు పర్యవేక్షించాలని చెప్పారు. డబుల్ ఇళ్ల పంపిణీలో నిబంధనలు పాటించాలని అన్నారు. ఇల్లెందు మున్సిపాలిటీ పరిధిలో నిర్మిస్తున్న ఇళ్లకు నీటి సమస్య పరిష్కరించాలని ఆదేశించారు. ధరణి దరఖాస్తులు పెండింగ్‌లో లేకుండా పరిష్కారానికి చర్యలు చేపట్టాలన్నారు. మీసేవా కేంద్రాల నిర్వాహకులు అధిక రుసుం వసూలు చేసినా, ప్రజల పట్ల అమర్యాదగా ప్రవర్తించినా నోటీసులు జారీ చేయాలని, అవసరమైతే కేంద్రాలను రద్దు చేయాలని తహసీల్దార్లను ఆదేశించారు. సమావేశంలో సర్వే ఏడీ కుసుమకుమారి, పీఆర్ ఈఈ సుధాకర్, ఆర్‌అండ్‌బీ ఈఈ భీమ్లా, గిరిజన సంక్షేమశాఖ ఈఈ తానాజీ, ఆర్డీఓలు స్వర్ణలత, రత్నకళ్యాణి తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో రాష్ట్ర పరిశీలకుడి తనిఖీ



విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలిస్తున్న అబ్దుల్ నబీ

తిరుమలాయపాలెం: మండలంలోని పిండిప్రోలు జిల్లా పరిషత్ పాఠశాలను రాష్ట్ర పరిశీలకుడు అబ్దుల్ నబీ గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా 6నుండి 8వ తరగతి విద్యార్థుల హిందీ భాషా సామర్థ్యాలను పరీక్షించారు. వీరికి పరీక్ష నిర్వహించడంతో పాటు ఉపాధ్యాయుడి బోధన తీరును పరిశీలించారు. ఆయన వెంట ఎంఈఓ బీ.వీ.రామాచారి పాల్గొనగా, ఆతర్వాత జింకలగూడెం ప్రాథమిక పాఠశాలను ఎంఈఓ తనిఖీ చేసి విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు.

విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించాలి

ఐటీడీఏ పీఓ గౌతమ్



విద్యార్థి సామర్థ్యాన్ని పరిశీలిస్తున్న పీఓ గౌతమ్

దుమ్ముగూడెం: గిరిజన సంక్షేమ, మోడల్, ప్రాథమిక పాఠశాలల్లో చదివే విద్యార్థులకు అర్థమయ్యేలా పాఠాలు బోధించాలని ఐటీడీఏ పీఓ గౌతమ్ పోట్రు ఉపాధ్యాయులకు సూచించారు. మండలంలోని ముసలిమడుగు, పెద్దనల్లబెల్లి పాఠశాలలను గురువారం ఆయన తనిఖీ చేశారు. జిక్సా మెటీరియల్‌కు సంబంధించిన ఫజిల్స్, వరల్డ్ మ్యాప్ తదితర అంశాలు ఎలా నేర్పిస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. టీచర్లు ఆ ఫజిళ్ల గురించి పూర్తిగా అవగాహన చేసుకున్నాకే విద్యార్థులకు చెప్పాలని అన్నారు. ముసలిమడుగు పాఠశాలలో ఇది సక్రమంగా అమలు కావడం లేదంటూ అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రతి మోడల్ స్కూల్, జీపీఎస్‌ల్లో నాలుగో తరగతి పిల్లలకు టీజీ సెట్, ఐదో తరగతి వారికి ఎంఆర్‌ఎఫ్ మెటీరియల్ సరఫరా చేశామని, ప్రత్యేక తరగతుల్లో వాటిపై విద్యార్థులకు శిక్షణ ఇవ్వాలని చెప్పారు. పాఠశాలలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయించాలని ఆదేశించారు. పెద్ద నల్లబెల్లిలో బాత్‌రూమ్‌లు సరిగా లేవని ఉపాధ్యాయుడు పీఓ దృష్టికి తేగా, బాలురకు మూడు, బాలికలకు మూడు బాత్‌రూమ్‌ల నిర్మాణానికి ప్రతిపాదనలు పంపించాలని ఏఈ వెంకటేశ్వర్లును ఆదేశించారు. కార్యక్రమంలో ఏటీడీఓ నర్సింహారావు, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

సీడీపీఓకు షోకాజ్ నోటీస్..

ముసలిమడుగు అంగన్‌వాడీ టీచర్ పార్వతి సక్రమంగా విధులు నిర్వహించడం లేదని, అనుమతి లేకుండా గైర్హాజరవుతోందని తెలుసుకున్న పీఓ.. దుమ్ముగూడెం సీడీపీఓ సలోమికి షోకాజ్ నోటీసు జారీ చేశారు. తక్షణమే సమాధానం చెప్పాలని ఆదేశించారు. టీచర్‌పై చర్యలు తీసుకోవాలని సూచించారు.

'పెదవాగు'కు మోక్షం

- ప్రాజెక్టు గేట్ల మరమ్మతు పనులు ప్రారంభం
- రూ.1.42 కోట్ల నిధులు విడుదల
- తొలగనున్న లీకేజీ ఇక్కట్లు



మరమ్మతులు చేసేందుకు పైకి ఎత్తి ఉంచిన పెదవాగు ప్రాజెక్ట్ గేటు

అశ్వారావుపేటరూరల్: మండలంలోని గుమ్మడవల్లి పెదవాగు ప్రాజెక్ట్‌కు చాలా కాలం తర్వాత మహర్దశ పట్టింది. గేట్ల లీకేజీ సమస్యలతో ఎన్నో ఏళ్లుగా సతమతం అవుతున్న ఈ ప్రాజెక్టు దుస్థితిపై పలుమార్లు వివిధ పత్రికల్లో కథనాలు రావడం, ఆయకట్టు రైతుల ఆందోళనల నేపథ్యంలో ఎట్టకేలకు నిధులు మంజూరయ్యాయి. హైదారాబాద్‌కు చెందిన ఓ ఇంజనీరింగ్ సంస్థ టెండర్ ద్వారా పనులు దక్కించుకుంది. ఈ సంస్థ సిబ్బంది ఆధ్వర్యంలో గురువారం ప్రాజెక్ట్ గేట్ల మరమ్మతు పనులను ప్రారంభించారు. వచ్చే వానాకాలం సీజన్ నాటికి పనులు పూర్తి చేసేందుకు కృషి చేస్తున్నట్లు ప్రాజెక్ట్ పర్యవేక్షణ అధికారులు చెబుతున్నారు. తెలంగాణ, ఏపీ రాష్ట్రాల సరిహద్దులో గుమ్మడవల్లి వద్ద గల ఈ పెదవాగు ప్రాజెక్ట్ పూర్తి స్థాయి నీటి సామర్థ్యం 21 అడుగులు కాగా, దీని కింద 16 వేల ఎకరాల ఆయకట్టు ఉంది. తెలంగాణలోని అశ్వారావుపేట, ఏపీలోని ఏలూరు జిల్లా వేలేరుపాడు, కుక్కునూరు మండలాల్లో కుడి, ఎడమ కాలువలు ఉండగా, దీనిపై ఆధారపడి గిరిజన, గిరిజనేతర రైతులు ప్రధానంగా వరి, మొక్కజొన్న, మిర్చి పంటలు సాగు చేస్తున్నారు. ప్రాజెక్ట్‌కు మూడు గేట్లు ఉండగా, ఇవి గత పదేళ్లుగా లీకవుతున్నాయి. ప్రతి ఏడాది వర్షాకాలం సీజన్‌లో ప్రాజెక్ట్‌లోకి వచ్చే వరదనీరు లీకేజీలతో వృథాగా గోదావరిలో కలుస్తున్నాయి.

రూ.1.42 కోట్ల వ్యయంతో..

పెదవాగు ప్రాజెక్ట్‌కు మరమ్మతులు చేపట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం రూ.1.42 కోట్లు కేటాయించింది. ఈ నిధులతో ప్రధానంగా మూడు గేట్లను మరమ్మతు చేయడం, ప్రధాన స్లూయిజ్‌లకు ఐరన్ రెయిలింగ్, గేట్లను పైకి, కిందకు దించేందుకు 12.5 హెచ్‌పీ సామర్థ్యం గల రెండు మోటార్లు, కాపర్ కేబుల్‌తోపాటు ఇతర పనులు చేపట్టనున్నారు. ఈ పనులను వర్షాకాలం నాటికి పూర్తి చేస్తారు. దీంతో వచ్చే ఖరీఫ్ సీజన్‌లో లీకేజీల సమస్య తొలగిపోయి, రైతులకు ఇబ్బందులు లేకుండా సాగునీరు అందించేందుకు అధికారులు కృషి చేస్తున్నారు. కాగా చాలాకాలం తర్వాత పెదవాగు ప్రాజెక్ట్‌కు మరమ్మతులు చేపడుతుండడంతో ఆయకట్టు రైతుల్లో హర్షం వ్యక్తం అవుతోంది. దీనిపై ప్రాజెక్ట్ ఏఈఈ కేఎస్‌బీ కృష్ణ 'సాక్షి'తో మాట్లాడుతూ.. పనులు ప్రారంభించామని, సకాలంలో పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామని అన్నారు. వచ్చే పంటల సీజన్‌కు లీకేజీ సమస్య పరిష్కారం అవుతుందన్నారు.

నిఘా నీడన ఇల్లెందు

- సీసీ కెమెరాల ఏర్పాటుకు సింగరేణి నిధులు
- సుమారు రూ.9.80 లక్షల అంచనాతో..
- హై ఫ్రీక్వెన్సీ కెమెరాల ఏర్పాటే లక్ష్యం
- ఇప్పటికే పట్టణంలో పని చేస్తున్న కొన్ని నిఘా నేత్రాలు




సీసీ కెమెరాలు ఏర్పాటు చేయనున్న ఇల్లెందు పట్టణం

ఇల్లెందు: ఇకపై ఇల్లెందు పట్టణాన్ని పూర్తి స్థాయి నిఘా నీడన ఉంచాలని పోలీసులు విశ్వప్రయత్నం చేస్తున్నారు. ఏ చిన్న ఘటన జరిగినా క్షణాల్లో ఛేదించేలా సింగరేణి సహకారంతో రూ. 9.80 లక్షల నిధులతో హై ఫ్రీక్వెన్సీ సామర్థ్యం గల సీసీ కెమెరాలు ఏర్పాటు చేయనున్నారు. రాత్రయినా, పగలైనా బైక్ నంబర్ ప్లేట్లు కెమెరాల్లో రికార్డయ్యేలా అమర్చాలని యోచిస్తున్నారు. ఇందుకోసం సింగరేణి సీఎస్సార్ నిధులను ఏరియా జీఎం షాలేము రాజు కేటాయించారు. పట్టణంలో ఇప్పటికే కొన్ని 'నిఘా నేత్రాలు' పని చేస్తుండగా ఇప్పుడు మరింత విస్తరించనున్నారు.

కెమెరాల ఏర్పాటు ఇలా..

పట్టణంలో 24 వార్డులు, సుమారు 50 వేల జనాభా ఉన్నారు. ఇల్లెందు నుంచి ఖమ్మం, కొత్తగూడెం, పాఖాల, గుండాల, కారేపల్లి, సత్యనారాయణపురం వెళ్లే ప్రధాన రహదారులను కవర్ చేస్తూ సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. గోవింద్ సెంటర్, కరెంటాఫీస్, జగదాంబా సెంటర్, జేకే సెంటర్, పాత బస్టాండ్ సెంటర్‌లో హై ఫ్రీక్వెన్సీ కెమెరాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. 24, 21 ఏరియాలు, స్టేషన్ బస్తీ, నంబర్ -2 బస్తీ, ప్రభుత్వం వైద్యశాల, జేకే బస్టాప్, ఆంబజార్ కూడళ్లలో సాధారణ కెమెరాలు ఏర్పాటు చేయనున్నారు. ఈ నిఘా నేత్రాల ద్వారా పట్టణంలోకి వచ్చి వెళ్లే వాహనాలు, అసాంఘిక కార్యకలాపాలను సులభంగా గుర్తించే అవకాశం ఉంటుంది. ఇక సీసీ కెమెరాలు లేని ప్రాంతాల్లో పోలీసు పహారా ముమ్మరం చేయాలని, రాత్రి వేళల్లో పెట్రోలింగ్ పెంచాలని యోచిస్తున్నారు.

డీఎస్పీకి చెక్కు అందజేత..



డీఎస్పీకి చెక్కు అందజేస్తున్న సింగరేణి జీఎం, ఇతర అధికారులు

పట్టణంలో సీసీ కెమెరాలు ఏర్పాటుకు సింగరేణి ఇల్లెందు ఏరియా జీఎం ఎం. షాలేమురాజు సీఎస్సార్ నిధులు రూ.9.80 లక్షలు కేటాయించారు. ఈ మేరకు గురువారం తన కార్యాలయంలో డీఎస్పీ ఎస్.వి.రమణమూర్తికి చెక్కు అందజేశారు. పట్టణంలోని ముఖ్యమైన సెంటర్లలో ప్రజల రక్షణ కోసం నాలుగు హై ఫ్రీక్వెన్సీ కెమెరాలు, 20 సాధారణ కెమెరాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. కార్యక్రమంలో ఎస్‌ఓటూజీఎం మల్లారపు మల్లయ్య, ఫైనాన్స్ డీజీఎం రామచంద్ర, ఎస్టేట్ అధికారి మహేష్, సెక్యూరిటీ అధికారి అంజిరెడ్డి, ఏటీ మేనేజర్ సుధాకర్, సీనియర్ పర్సనల్ అధికారి సాయి స్వరూప్, గుర్తింపు సంఘం ఉపాధ్యక్షుడు ఎస్.రంగనాథ్ పాల్గొన్నారు.

మరో రూ.10 లక్షలు అవసరం

పట్టణంలో సీసీ కెమెరాల ఏర్పాటుకు కృషి చేస్తున్నాం. ఇందుకు సింగరేణి కేటాయించిన సీఎస్సార్ నిధులు రూ.9.80 లక్షలతో నాలుగు హై ఫ్రీక్వెన్సీ కెమెరాలు, 20 సాధారణ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నాం. ఇవి కాక మరో రూ.10 లక్షలు అవసరం అవుతాయి. వీటిని మున్సిపాలిటీ లేదా ఎమ్మెల్యే నిధుల నుంచి సేకరించేలా ప్రయత్నిస్తాం. బ్యాంకర్లు, వ్యాపారుల సహకారం కూడా తీసుకుంటాం.

– ఎస్వీ రమణమూర్తి, డీఎస్పీ

సాగుకు అనుగుణంగా సామర్థ్యం పెంపు

ఆయిల్‌ఫెడ్ ఎండీ సురేందర్



బాయిలర్ నిర్మిత స్థలాన్ని పరిశీలిస్తున్న సురేందర్ తదితరులు

అశ్వారావుపేటరూరల్: పామాయిల్ సాగు విస్తీర్ణానికి అనుగుణంగా అశ్వారావుపేట, దమ్మపేట పామాయిల్ ఫ్యాక్టరీల సామర్థ్యాన్ని పెంచుతామని ఆయిల్‌ఫెడ్ ఎండీ సురేందర్ తెలిపారు. స్థానిక ఫ్యాక్టరీలో కొత్తగా బాయిలర్ నిర్మించే స్థలాన్ని ఆయన గురువారం పరిశీలించారు. సివిల్ పనులను వారం రోజుల్లో పూర్తి చేయాలని కాంట్రాక్టర్లను ఆదేశించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ.. పామాయిల్ ఫ్యాక్టరీల సామర్థ్యాన్ని పెంచేందుకు రూ.120 కోట్ల అంచనాతో ప్రతిపాదనలు రూపొందించినట్లు చెప్పారు. అశ్వారావుపేట ఫ్యాక్టరీని 30 నుంచి 60 మెట్రిక్ టన్నుల సామర్థ్యానికి, అప్పారావుపేట ఫ్యాక్టరీ సామర్థ్యాన్ని 60 నుంచి 90 మెట్రిక్ టన్నులకు పెంచుతామని వివరించారు. ఇందుకోసం ఒక్కో ఫ్యాక్టరీకి రూ.30 కోట్ల చొప్పున అవసరమవుతాయని తెలిపారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఇప్పటివరకు 35వేల ఎకరాల్లో కొత్తగా పామాయిల్ సాగు ప్లాంటేషన్ పూర్తి చేశామని, వచ్చే ఏడాది నుంచి దిగుబడులు వస్తాయని అన్నారు. స్థానిక ఫ్యాక్టరీలో కొత్తగా నిర్మించే బాయిలర్ పనులు వచ్చే ఏడాది జనవరి నాటికి పూర్తవుతాయని తెలిపారు. వచ్చే సంవత్సరంల సిద్దిపేట, కల్లూరుల్లో కొత్త ఫ్యాక్టరీలు నిర్మిస్తామని చెప్పారు. పట్టాలు లేని భూముల్లో పామాయిల్ తోటల సాగు చేసే రైతులకు సబ్సిడీ లేకుండా పూర్తి ధరకు మొక్కలు అందిస్తామని, పోడు పట్టాలు, సాగునీటి వనరులున్న భూములకు కూడా ప్రభుత్వం ఆదేశం మేరకు మొక్కలు అందించేందుకు సిద్ధంగా ఉన్నామని వివరించారు. అనంతరం రైతుల సమస్యలపై ఆయిల్‌ఫెడ్ సాగుదారుల సంఘం నాయకుడు కొక్కెరపాటి పుల్లయ్య ఎండీకి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జీఎం సుధాకర్ రెడ్డి, పీఅండ్‌పీ మేనేజర్ శ్రీకాంత్, డీఓ ఆకుల బాలకృష్ణ, ఫ్యాక్టరీ మేనేజర్ కల్యాణ్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

రికార్డుల పరంపర కొనసాగించాలి

సింగరేణి డైరెక్టర్ వెంకటేశ్వరరెడ్డి



బొగ్గు ఉత్పత్తిని పరిశీలిస్తున్న డైరెక్టర్ వెంకటేశ్వరరెడ్డి

మణుగూరుటౌన్: మణుగూరు ఏరియాలోని పీకేఓసీ–2 బొగ్గు ఉత్పత్తిలో రికార్డుల పరంపర కొనసాగించాలని సింగరేణి డైరెక్టర్ (ప్రాజెక్ట్, ప్లానింగ్) జి.వెంకటేశ్వరరెడ్డి సూచించారు. గురువారం ఆయన ఏరియా పీకేఓసీ–2ను సందర్శించారు. వ్యూపాయింట్ నుంచి గనిలో బొగ్గు ఉత్పత్తిని, బంకర్ నుంచి సరఫరాను పరిశీలించారు. గనిలో తనిఖీలు చేపట్టారు. యంత్రాల పని గంటలు 14 నుంచి 18 గంటల వరకు పెంచుకోవాలని సూచించారు. రక్షణతో కూడిన ఉత్పత్తి సాధనకు సమష్టిగా కృషి చేయాలని చెప్పారు. మణుగూరు ఏరియా నిర్దేశిత వార్షిక లక్ష్యమైన 116 లక్షల టన్నులను ఉత్పత్తి అధిగమించాలని పేర్కొన్నారు. ఏరియా జీఎం దుర్గం రాంచందర్, పీకేఓసీ పీఓ లక్ష్మీపతిగౌడ్, ప్రాజెక్ట్ ఇంజనీర్ వీరభద్రుడు, ప్రాజెక్ట్ మేనేజర్ ఎం.రాముడు, మేనేజర్ పీకే ఓసీ రాంబాబు, సీనియర్ సెక్యూరిటీ అధికారి అబ్దుల్ షబ్బీరుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలి



వర్క్‌షాప్‌లో మాట్లాడుతున్న కోనేరు సత్యనారాయణ

భద్రాచలంటౌన్: తెలంగాణ రాష్ట్రంలో రాబోయే ఎన్నికల్లో బీజేపీదే విజయమని, ఇందుకోసం ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు కోనేరు సత్యనారాయణ సూచించారు. భద్రాచలం పట్టణంలోని సమ్మక్క సారక్క ఫంక్షన్ హాల్‌లో గురువారం నియోజకవర్గస్థాయిలో నిర్వహించిన బూత్ స్వశక్తీకరణ్ అభియాన్ వర్క్‌షాప్‌లో ఆయన మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా ఈ నెల 12 నుంచి 22 వరకు బూత్ స్థాయిలో 22 మందితో కమిటీలను ఏర్పాటు చేయాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే కుంజా సత్యవతి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎడపల్లి శ్రీనివాస్, శ్రీనివాసాచారి, శ్రీనివాసరెడ్డి, క్రాంతికుమార్, రామ్మోహన్‌రావు, రామ్‌కిషోర్, వెంకన్న, కేశవ్ తదితరులు పాల్గొన్నారు.

కాలం చెల్లిన కూల్‌డ్రింక్స్ అమ్మకాలు

టేకులపల్లి: మండల కేంద్రంలో కాలం చెల్లిన కూల్‌డ్రింక్స్ విక్రయిస్తున్న విషయం గురువారం వెలుగుచూసింది. మండలంలోని చుక్కాలబోడు గ్రామానికి చెందిన సమాజ సేవకుడు దారావత్ నాగేంద్రబాబు కూల్‌డ్రింక్ తాగేందుకు టేకులపల్లి సెంటర్‌లోని ఓ కిరాణ షాపునకు వెళ్లాడు. యజమాని కూల్‌డ్రింక్ ఇవ్వగా పరిశీలిస్తే కాలం చెల్లినట్లు ఉన్నది. దుకాణంలో ఎక్కువ సంఖ్యలో కాలం చెల్లినవే ఉండటంతో ఎంపీటీసీ సభ్యుడు ఊకె రామకృష్ణతో కలిసి వెళ్లి టేకులపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ట్విట్టర్ ద్వారా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు నాగేంద్రబాబు తెలిపాడు.

ఏజెన్సీపై చిన్నచూపా..?

- దూరప్రాంతాలకు టీఎస్ ఆర్టీసీ సర్వీసుల తొలగింపు
- హైదరాబాద్, గుంటూరు, రాజమండ్రి వెళ్లాలంటే తిప్పలు
- అదే అదునుగా అధిక చార్జీలు వసూలు చేస్తున్న ప్రైవేటు ట్రావెల్స్



చర్ల నుంచి హైదరాబాద్‌కు నడిచే ప్రైవేట్ సర్వీసులు

దుమ్ముగూడెం: ఏజెన్సీ ప్రాంతాల నుంచి హైదరాబాద్, గుంటూరు, రాజమండ్రి తదితర ప్రాంతాలకు ఆర్టీసీ బస్సులు లేకపోవడంతో ప్రయాణికులకు ఇక్కట్లు తప్పడంలేదు. గతంలో చర్ల, వెంకటాపురం, దుమ్ముగూడెం మండలాల నుంచి అనేక సర్వీసులు నడిచేవి. కానీ కొంతకాలంగా నిలిచిపోయాయి. ప్రస్తుతం భద్రాచలానికి తప్ప ఇతర పట్టణాలకు సర్వీసులు లేవు. దీంతో ఆయా మండలాల నుంచి భద్రాచలం వచ్చి బస్సులు ఎక్కాలి వస్తోంది.

మిర్చి రైతులకు తిప్పలు..

భద్రాచలం నుంచి పేరూరుకు సుమారు 140 కిలోమీటర్ల దూరం ఉంటుంది. గతంలో పేరూరు నుంచి కూకట్‌పల్లి, రాజమండ్రి, గుంటూరు సర్వీసులను నడిపేవారు. ఆదాయం లేదనే సాకుతో ఆ సర్వీసులను తొలగించారు. చర్ల నుంచి బాపట్ల సర్వీస్ ఉండగా, అది కూడా నిలిపివేశారు. చర్ల, దుమ్ముగూడెం మండలాలతోపాటు ములుగు జిల్లాలోని వెంకటాపురం, వాజేడు, పేరూరు, ధర్మారం ప్రాంతాల్లో ఎక్కువగా వ్యవసాయం చేస్తుంటారు. దీంతో రైతులు మిర్చి విక్రయించుకునేందుకు గుంటూరు వెళ్లేవారు. వారి రాకపోకలకు సర్వీసులు అనుకూలంగా ఉండేవి. ఇప్పుడు ఒక పూట ముందే భద్రాచలం వచ్చి గుంటూరు తదితర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోంది.

ప్రైవేట్ ట్రావెల్స్‌కు దండిగా ఆదాయం..

టీఎస్ ఆర్టీసీ అధికారులు ఏజెన్సీ మండలాల నుంచి లాంగ్ సర్వీస్‌లను రద్దు చేయడంతో ప్రైవేటు బస్సులు దూసుకుపోతున్నాయి. చర్ల నుంచి నిత్యం హైదరాబాద్‌కు నాలుగు ప్రైవేటు సర్వీసులు తిరుగుతున్నాయి. ప్రైవేట్ బస్సులు ఏసీ, నాన్ ఏసీ, స్లీపర్ సర్వీసులు నడుపుతూ ట్రావెల్స్ యజమానులు ఆదాయం పొందుతున్నారు. భద్రాచలం నుంచి ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని మద్దేడు, భూపాలపట్నం వరకు కూడా ప్రైవేట్ బస్సులు తిరుగుతున్నాయి. గతంలో రోడ్డు సౌకార్యం సరిగ్గా లేకపోవడంతో బస్సులు నడిపేందుకు ఇబ్బందులు ఉండేవి. ప్రస్తుతం హైవేలు నిర్మించడంతో అంతర్రాష్ట్ర రవాణా సులభంగా మారింది. కానీ ఆర్టీసీ అధికారులు మాత్రం సర్వీసులు నడపడం లేదు. దీంతో సంస్థ ఆదాయం కోల్పోతోంది. ప్రైవేట్ బస్సుల్లో చార్జీలు అధికంగా వసూళ్లు చేస్తున్నా ప్రయాణించక తప్పడంలేదని ఏజెన్సీవాసులు వాపోతున్నారు. ఇప్పటికైనా టీఎస్ ఆర్టీసీ ఉన్నతాధికారులు స్పందించి ఏజెన్సీ ప్రాంతాల నుంచి హైదరాబాద్, గుంటూరు, రాజమండ్రి తదితర ప్రాంతాలకు బస్సులు నడపాలని పలువురు కోరుతున్నారు. దీనిపై ఆర్టీసీ భద్రాచలం డిపో మేనేజర్ వి.రామారావును వివరణ కోరేందుకు పలుమార్లు ప్రయత్నించినా.. ఆయన అందుబాటులో లేరు.

లాంగ్ సర్వీసులు ఏర్పాటు చేయాలి



ఆర్టీసీ అధికారులు గతంలో లాగా లాంగ్ సర్వీసులు ఏర్పాటు చేయాలి. సుదూర ప్రాంతాలకు ప్రయాణం చేయాల్సిన ప్రజలు భద్రాచలం వచ్చి అక్కడి నుంచి మళ్లీ మరో సర్వీసుకు మారాల్సి వస్తోంది. వెంకటాపురం, చర్ల నుంచి నేరుగా సర్వీసులు ఏర్పాటు చేయాలి.

– సాగివెంకట జగన్నాథరాజు, గోగుబాక, చర్ల మండలం

అశ్వారావుపేటలో సెంట్రల్ లైటింగ్..



నిధుల మంజూరు పత్రం ఎమ్మెల్యే మెచ్చాకు అందిస్తున్న సీఎం కేసీఆర్

అశ్వారావుపేటరూరల్: నియోజకవర్గ కేంద్రమైన అశ్వారావుపేటలో సెంట్రల్ లైటింగ్ ఏర్పాటుకు నిధులు మంజూరయ్యాయి. ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు గురువారం సీఎం కేసీఆర్‌ను కలిసి విన్నవించగా రూ.23.50 కోట్లు కేటాయించారు. దీంతో రింగ్ రోడ్ సెంటర్ నుంచి భద్రాచలం రోడ్‌లో నాలుగు లైన్ల రోడ్ విస్తరణతోపాటు జంగారెడ్డిగూడెం రోడ్‌లో కాకతీయ గేట్ వరకు, ఖమ్మం రోడ్‌లో పేరాయిగూడెం వద్దగల శ్రీ ఆంజనేయస్వామి ఆలయం వరకు సెంట్రల్ లైటింగ్, డివైడర్, డ్రెయినేజీల నిర్మాణం చేపట్టనున్నట్లు ఎమ్మెల్యే మెచ్చా తెలిపారు. దశాబ్దాల నుంచి పెండింగ్‌లో ఉన్న సమస్య పరిష్కారానికి నిధులు రావడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

దూలుగొండ జాతరలో సందడి



అమ్మవారిని గద్దెలపై ప్రతిష్టిస్తున్న భక్తులు

గుండాల: ఈసం వంశీయుల ఆరాధ్య దైవం దూలుగొండ ముసలమ్మ దేవత గురువారం గద్దెనెక్కడంతో నిండు జాతర మొదలైంది. మండలంలోని రోళ్లగడ్డ గ్రామంలో బుధవారం మండల మెలుగుట, గుడి మెలుగుట నిర్వహించారు. గురువారం అమ్మవారిని గద్దెలపై ప్రతిష్ఠించారు. దేవున్ని తీసుకొచ్చే క్రమంలో భక్తులు డోలి చప్పుళ్లతో నృత్యాలు చేశారు. భక్తి శ్రద్ధలతో మొక్కులు చెల్లించుకున్నారు. శుక్రవారం దేవతలను వనానికి తరలించడంతో జాతర ముగుస్తుందని కమిటీ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈసం కృష్ణ, బిక్షం, కన్నయ్య, రాంమూర్తి, శేఖర్, మల్లయ్య, పాపారావు, ఎర్రయ్య, నారాయణ, పాపమ్మ, నర్సయ్య,సత్యం,పొట్టయ్య, సింగన్న, రామయ్య, సంజీవ్, నాగేశ్వరావు, నరేష్, ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రేమించాడని చావబాదారు..

- విచక్షణారహితంగా దాడి చేసిన యువతి బంధువులు
- ఆస్పత్రిలో చికిత్స పొందుతూ యువకుడు మృతి



బొమ్మగాని వెంకటేష్ (ఫైల్)

కామేపల్లి(కారేపల్లి)/ఖమ్మం రూరల్: ప్రేమించడమే ఆ యువకుడు చేసిన పాపం.. ప్రేమను వ్యతిరేకించడానికి కారణాలేమిటో తెలియదు కానీ బంధువు అని కూడా చూడకుండా యువతి బంధువులు విచక్షణారహితంగా దాడి చేశారు. దీంతో స్పృహ కోల్పోయిన యువకుడిని ఆయన ఇంటికి తీసుకెళ్లారు. ఆతర్వాత ఐదు రోజులకు ఆస్పత్రిలో చేర్పించడంతో చికిత్స పొందుతూ గురువారం ఉదయం మృతి చెందాడు. ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి. కామేపల్లి మండలం పండితాపురానికి చెందిన బొమ్మగాని వెంకటేష్(23) ఖమ్మంలోని ఓ సంస్థ సరుకుల డెలివరీ సెంటర్‌లో పనిచేస్తున్నాడు. తమ బంధువైన చింతకాని మండలం చిన్నమండవకు చెందిన బీటెక్ విద్యార్థినిని కొన్నాళ్లుగా ప్రేమిస్తున్నాడు.

వీరి ప్రేమ విషయం తెలిసినప్పటి నుంచి యువతి తల్లిదండ్రులు వ్యతిరేకిస్తున్నారు. ఈక్రమంలో ఈనెల 2వ తేదీన పండితాపురంలో జరుగుతున్న శివాలయం జాతరకు ఆమెను వెంకటేశ్ హాస్టల్ నుంచి తీసుకొచ్చాడు. అయితే, ఆయన తండ్రి అమ్మాయిని ఎందుకు తీసుకొచ్చావని మందలించడంతో 3న మోటార్ సైకిల్‌పై హాస్టల్‌కు తీసుకెళ్లాడు. అయితే, జ్వరంగా ఉందని యువతి ఇంటికి వెళ్లిపోయినట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఆమె తల్లిదండ్రులకు సమాచారమిచ్చారు. కానీ ఆమె ఇంటికి రాకపోవడంతో 3వ తేదీన ఉదయం తల్లిదండ్రులు పరుపగాని లక్ష్మయ్య, రేణుక, బంధువులు బండి కృష్ణ, తాటిమల్ల నాగేశ్వరరావు ఖమ్మం రూరల్ మండలం పెద్దతండాలోని కళాశాల వద్దకు వచ్చారు. ఇంతలోనే బైక్‌పై వెంకటేష్, యువతి వస్తుండడంతో గమనించిన వారు ఆగ్రహంతో బైక్‌ను అడ్డుకుని వెంకటేష్‌ను చితకబాదారు. దీంతో వెంకటేష్ స్పృహ కోల్పోయాక వారంతా వెళ్లిపోయారు. కాసేపటికి మేల్కొ న్న వెంకటేష్ ఫోన్ ద్వారా తన తల్లిదండ్రులకు సమాచారం ఇవ్వడంతో వారు వెళ్లి ఇంటికి తీసుకొచ్చారు. కాగా, 8వ తేదీన వెంకటేశ్ తన ఆరోగ్యం బాగాలేదని చెప్పడంతో ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం ఉదయం ఆయన మృతి చెందాడు.



మృతుడి బంధువులతో మాట్లాడుతున్న సీఐ శ్రీనివాస్

బంధువుల ఆందోళన

యువకుడు వెంకటేష్ చావుకు కారణమైన లక్ష్మయ్య, ఇతరులపై చర్యలు తీసుకోవాలని ఆయన బంధువులు డిమాండ్ చేశారు. వెంకటేష్‌ను విచక్షణా రహితంగా కొట్టడంతోనే మృతి చెందాడంటూ బంధువులు ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీ వద్ద ఆందోళనకు దిగారు. తొలుత ధర్నాచౌక్‌లో కూడా నిరసన తెలిపారు. దీంతో ఖమ్మం టూ టౌన్ సీఐ శ్రీధర్, ఖమ్మం రూరల్ సీఐ శ్రీనివాస్ చేరుకుని విచారణ అనంతరం బాధ్యులపై చర్యలు తీసుకుంటామని నచ్చచెప్పడంతో వారు ఆందోళన విరమించారు. కాగా, వెంకటేష్ తండ్రి బాబు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

అన్నపురెడ్డిపల్లి: అనుమానాస్పద స్థితిలో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలో బుధవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. పోలీసులు, కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన బలుసు నాగేశ్వరరావు(45) మద్యానికి బానిసయ్యాడు. కుటుంబ సభ్యులు బుధవారం రాత్రి గ్రామంలో జరుగుతున్న శ్రీబాలాజీ వేంకటేశ్వర స్వామివారి ఉత్సవాలకు వెళ్లారు. అర్ధరాత్రి తర్వాత ఇంటికి తిరిగి రాగా.. నాగేశ్వరరావు ఇంటి వరండాలో మృతి చెంది ఉన్నాడు. మృతుడికి భార్య, కూతురు, కుమారుడు ఉన్నారు. మృతుడి కూతురు నందిని ఫిర్యాదు మేరకు ఎస్సై షాహినా కేసు నమోదు చేశారు. నాగేశ్వరరావు గుండెపోటుతో మృతి చెందాడా? లేక ఆత్మహత్య చేసుకున్నాడా? అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తిపై కేసు నమోదు

అశ్వారావుపేటరూరల్: అప్పు పేరుతో వేధిస్తున్న ఓ వ్యక్తిపై గురువారం పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్ఐ రాజేశ్‌కుమార్ కథనం ప్రకారం.. మండల పరిధిలోని వినాయకపురం గ్రామానికి చెందిన హసీనా అనే మహిళ అదే గ్రామానికి చెందిన భూక్యా ఏసు అనే వ్యక్తి వద్ద కొంత నగదు అప్పుగా తీసుకుంది. ఈ బాకీను ఆమె పలు దఫాలుగా తిరిగి చెల్లించింది. అయినా ఇంకా అప్పు తీరలేదంటూ వేధిస్తున్నాడు. ఈ విషయాన్ని గ్రామ పెద్దలకు చెప్పడంతో దుర్భాషలాడాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు ఏసుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రేషన్‌బియ్యం పట్టివేత

బూర్గంపాడు: మండల పరిధిలోని టాస్క్‌ఫోర్స్ అధికారులు గురువారం దాడులు నిర్వహించి 48 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టుకున్నారు. పినపాక పట్టీనగర్ గ్రామంలో ఓ ఇంట్లో అక్రమంగా నిల్వచేసిన 48 క్వింటాళ్ల బియ్యాన్ని పట్టుకుని స్వాధీనం చేసుకున్నారు. బియ్యం అక్రమ నిల్వలకు పాల్పడిన వ్యక్తులపై కేసులు నమోదు చేసినట్లు టాస్క్‌ఫోర్స్ ఎస్ఐ తిరుపతి తెలిపారు.

ఆదమరిచి ఆపరేషన్

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలో ఓ ప్రముఖ వైద్యుడు ఆదమరిచి శస్త్ర చికిత్స చేయడంతో ఓ మహిళకు ప్రాణాపాయ పరిస్థితి ఏర్పడిన ఘటన గురువారం రాత్రి జరిగింది. పట్టణంలోని ఓ మహిళకు ఎడమవైపు పేగు జారడంతో శస్త్ర చికిత్స చేయించేందుకు కుటుంబసభ్యులు బస్టాండ్ వెనుక గల ఓ ప్రముఖ వైద్యుడి వద్దకు తీసుకెళ్లారు. ఈ క్రమంలో ఆ వైద్యుడు ఎడమ వైపునకు బదులు కుడివైపు శస్త్ర చికిత్స చేయడంతో ఆ మహిళ పరిస్థితి విషమంగా మారింది. గమనించిన కుటుంబ సభ్యులు వైద్యుడిని నిలదీయడంతో ఆస్పత్రి వద్ద కొంత ఉద్రిక్త వాతావరణం నెలకొంది. మరోసారి శస్త్ర చికిత్స చేసి సమస్య పరిష్కరిస్తామని వైద్యుడు హామీ ఇవ్వడంతో గొడవ సద్దుమణిగింది. కాగా శస్త్ర చికిత్స చేస్తున్న సమయంలో వైద్యుడు మద్యం మత్తులో ఉన్నట్లు బాధిత మహిళ కుటుంబ సభ్యులు ఆరోపించినట్లు సమాచారం.



1.62 క్వింటాళ్ల గంజాయి స్వాధీనం

- మల్కనగిరి నుంచి కర్ణాటకు తరలిస్తుండగా పట్టివేత
- గంజాయి విలువ రూ.40 లక్షలు



నిందితులను, గంజాయిని చూపెడుతున్న ఎక్సైజ్ అధికారులు

పాల్వంచ: ఒడిశా రాష్ట్రం మల్కనగిరి నుంచి కర్ణాటక రాష్ట్రానికి రెండు కార్లలో గంజాయి తరలిస్తుండగా ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు గురువారం వలపన్ని పట్టుకున్నారు. ఎక్సైజ్ అధికారుల కథనం ప్రకారం... అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ తిరుపతి, ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ పి.శామ్యూల్ జాన్, పాల్వంచ సీఐ ఆర్.గురునాథ్ రాథోడ్ ఆధ్వర్యంలో పాల్వంచ మండలం బసవతారక కాలనీ సమీపంలో భద్రాచలం జాతీయ రహదారిపై వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ క్రమంలో భద్రాచలం వైపు నుంచి వస్తున్న రెండు కార్లు అధికారులను గమనించి కేఎల్ఆర్ ఇంజనీరింగ్ కళాశాల సమీపంలోని జామాయిల్ తోట రోడ్ వైపు వెళ్లాయి. అక్కడ స్మగ్లర్లు కార్లను వదిలి పరారయ్యేందుకు ప్రయత్నించగా ఎక్సైజ్ అధికారులు వెంటాడి పట్టుకున్నారు. భద్రాచలానికి చెందిన కొత్తపల్లి బాలకృష్ణ, కర్ణాటక రాష్ట్రానికి చెందిన దేవేందర్, బలిరాంలను అదుపులోకి తీసుకున్నారు. ఏపీలోని తూర్పుగోదావరి జిల్లా ఎటపాక గ్రామానికి చెందిన బుర్ర సాయి కుమార్ పరారయ్యాడు. రెండు కార్లలో 1.62 క్వింటాళ్ల గంజాయిని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. రెండు కార్లు, రెండు సెల్‌ఫోన్‌లు, 2 కర్ణాటక తల్వార్లు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం పాల్వంచ స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశారు. ఈ దాడిలో ఎస్ఐ ఎస్‌కె.ముబాషీర్, సిబ్బంది ఎం.కరీం, జి.బాలు, బి.భిక్షం, టి.వెంకటేశ్వర్లు, వి.హనుమంతరావు, పి.విజయ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు. కాగా ఆ కార్లలో ఓ రాజకీయ పార్టీకి చెందిన ప్రచార సామగ్రి ఉన్నట్లు సమాచారం.

మూత్ర విసర్జనంటూ పరారయ్యాడు..
పాత కేసులతో పట్టుబడ్డాడు!

పాల్వంచ: మూత్ర విసర్జన చేస్తానంటూ సిబ్బంది కళ్లుగప్పి ఎక్సైజ్ స్టేషన్ నుంచి ఇటీవల పరారైన నిందితుడిని అధికారులు గురువారం పట్టుకున్నారు. ఎక్సైజ్ అధికారుల కథనం ప్రకారం... ఈ నెల 5న మోటార్ సైకిల్‌పై గంజాయిని తరలిస్తున్న హనుమకొండకు చెందిన జున్ను మనోహర్ ఖమ్మం ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులకు పాల్వంచ మండలం పెద్దమ్మగుడి వద్ద చిక్కాడు. అనంతరం అతడి నుంచి 7 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకుని పాల్వంచ ఎక్సైజ్ స్టేషన్‌లో అప్పగించారు.కేసు నమోదు చేసి కొత్తగూడెం మేజిస్ట్రేట్ ముందు హాజరుపరిచేందుకు బయలుదేరుతున్న సమయంలో మూత్ర విసర్జన చేస్తానంటూ కానిస్టేబుళ్ల కళ్లు గప్పి నిందితుడు పరారయ్యాడు. దీంతో ఎక్సైజ్ అధికారులు అదే రోజు పాల్వంచ పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతోపాటు అతనిపై ఉన్న పాత కేసులు ఆధారంగా నిఘా పెట్టారు. హనుమకొండ జిల్లా సుబేదారి స్టేషన్‌లో కేసులు ఉన్నట్లు గుర్తించి, గాలింపు చేపట్టగా పాల్వంచ నవభారత్ ఏరియాలో కదలికలు ఉన్నట్లు తెలిసింది. దీంతో గురువారం పట్టుకుని జైలుకు తరలించినట్లు ఎక్సైజ్ సీఐ గురునాథ్‌రాథోడ్ తెలిపారు.

క్లుప్తంగా...

బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థుల నామినేషన్లు



గన్‌పార్కులో అమరవీరుల స్తూపం వద్ద ఎమ్మెల్సీ అభ్యర్థులు

సాక్షి, హైదరాబాద్: ఎమ్మెల్యే కోటా శాసనమండలి బీఆర్‌ఎస్ అభ్యర్థులు గురువారం తమ నామినేషన్లను దాఖలు చేశారు. పార్టీ అభ్యర్థులు దేశపతి శ్రీనివాస్, నవీన్ కుమార్, చల్లా వెంకట్రామిరెడ్డి తమ నామినేషన్ పత్రాలను శాసనసభలో రిటర్నింగ్ అధికారికి సమర్పించారు. కార్యక్రమానికి మంత్రులు హరీశ్‌రావు, వేముల ప్రశాంత్ రెడ్డి, మల్లారెడ్డి, తలసాని శ్రీనివాస్ యాదవ్, సబితా ఇంద్రారెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, మహమూద్ అలీ, ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్ రెడ్డి, ప్రభుత్వ విప్‌లు బాల్క సుమన్, గువ్వల బాల్‌రాజ్, శంబీపూర్‌రాజు సహా పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు హాజరయ్యారు. అంతకుముందు ఎమ్మెల్సీ అభ్యర్థులు గన్‌పార్కులోని అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పించారు.

పీఆర్‌టీయూటీఎస్ అభ్యర్థికి మద్దతు



సాక్షి, హైదరాబాద్: టీటీజేఏసీ, పలు ఉపాధ్యాయ సంఘాలు బలపరిచిన పీఆర్‌టీయూటీఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థి గుర్రం చెన్నకేశవరెడ్డికి తెలంగాణ స్టేట్ కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం ఎంప్లాయిస్ యూనియన్ మద్దతు ప్రకటించింది. పీఆర్‌టీయూటీఎస్ నేతలు పింగిలి శ్రీపాల్ రెడ్డి, బీరెల్లి కమలాకర్‌ను గురువారం టీఎస్‌సీపీఎస్‌ఈయూ నేతలు శ్రీకాంత్, నరేష్‌గౌడ్ కలిసి ఈమేరకు మద్దతు ప్రకటించారు.

గాల్‌రెడ్డిని గెలిపించండి

సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్-రంగారెడ్డి-మహబూబ్‌నగర్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి గాల్‌రెడ్డి హర్షవర్ధన్ రెడ్డిని గెలిపించాలని టీపీసీసీ అధ్యక్షుడు ఎ.రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆయన ఉపాధ్యాయ ఓటర్లకు గురువారం బహిరంగ లేఖ రాశారు.

కుటుంబ పాలనే బీఆర్‌ఎస్ మోడల్!

'కరీంనగర్ కవాతు' బహిరంగ సభలో ఛత్తీస్‌గఢ్ సీఎం భూపేశ్ బాఘేల్

- తెలంగాణలో యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు లేవు
- కేసీఆర్ కుటుంబంలో మాత్రం అందరికీ ఉద్యోగాలు వచ్చాయి
- తాము రైతులకు మద్దతు ధర, పంట మార్పిడికి ప్రోత్సాహం ఇస్తున్నామని వెల్లడి
- తెలంగాణలో ఛత్తీస్‌గఢ్ మోడల్ అమలు చేస్తాం: రేవంత్‌రెడ్డి



బహిరంగసభలో ప్రసంగిస్తున్న ఛత్తీస్‌గఢ్ సీఎం భూపేశ్ బాఘేల్. వేదికపై దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, రేవంత్‌రెడ్డి, మాణిక్‌రావ్ ఠాక్రే, భట్టి, జైరాం రమేశ్, జీవన్‌రెడ్డి తదితరులు

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: "తెలంగాణ వచ్చినా రైతులు, నిరుద్యోగులకు ఉద్యోగ , ఉపాధి అవకాశాలు లభించలేదు. కానీ కేసీఆర్ కుటుంబంలోని కేటీఆర్, హరీశ్‌రావు, లిక్కర్ క్వీన్ కవితకు ఉద్యోగాలు వచ్చాయి.." అని ఛత్తీస్‌గఢ్ సీఎం, కాంగ్రెస్ నేత భూపేశ్ బాఘెల్ మండిపడ్డారు. దేశ సంపద అంతా ఒకరిద్దరి చేతుల్లోకి వెళ్లిందని.. అది బీజేపీ గుజరాత్ మోడల్ అని.. అదే తెలంగాణలో కుటుంబ పాలన బీఆర్‌ఎస్ మోడల్ అని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ పార్టీ 'హాథ్ సే హాథ్ జోడో' యాత్ర కరీంనగర్‌కు చేరుకున్న సందర్భంగా.. గురువారం సాయంత్రం పట్టణంలోని అంబేడ్కర్ స్టేడియంలో 'కరీంనగర్ కవాతు' పేరిట బహిరంగ సభ నిర్వహించింది. ఈ సభలో టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి, కేంద్ర మాజీ మంత్రి, ఎంపీ జైరాం రమేశ్, రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావు ఠాక్రే, సీఎల్పీ నేత భట్టి విక్రమార్క, ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, మాజీమంత్రి శ్రీధర్‌బాబు, మాజీ ఎంపీలు పొన్నం ప్రభాకర్, సురేశ్ షెట్కార్, సిరిసిల్ల రాజయ్య, వీహెచ్, అంజన్‌కుమార్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సభలో భూపేశ్ బాఘెల్ ప్రసంగిస్తూ.. ఛత్తీస్‌గఢ్‌లో రైతుల ధాన్యానికి మద్దతు ధర రూ.2,640, నిరుద్యోగ భృతి కింద రూ.2,500, పంటమార్పిడికి రూ.9,000, పేడ కిలోకి రూ.2తోపాటు గోమూత్రానికి కూడా డబ్బులు చెల్లిస్తూ.. గ్రామీణుల జీవితాల్లో వెలుగులు నింపామని చెప్పారు. తెలంగాణలోనూ కాంగ్రెస్‌ను గెలిపించాలని, ఛత్తీస్‌గఢ్ మోడల్‌ను అమలు చేద్దామని పిలుపునిచ్చారు.

రైతులు, నిరుద్యోగులకు పెద్దపీట: రేవంత్

తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే.. ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేస్తామని, ఛత్తీస్‌గఢ్ మోడల్‌తో రైతులకు, నిరుద్యోగులకు పెద్దపీట వేస్తామని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి చెప్పారు. "తెలంగాణ రాష్ట్రం ఇస్తే రాజకీయంగా ఏపీలో నష్టపోతామని తెలిసినా.. మాటకు కట్టుబడి తెలంగాణ ప్రజల ఆకాంక్షలను కాంగ్రెస్ పార్టీ నెరవేర్చింది. కానీ నీళ్లు, నిధులు, నియామకాల పేరిట తెలంగాణలో అధికారంలోకి వచ్చిన సీఎం కేసీఆర్ రైతులు, యువతను దగా చేశారు. కరీంనగర్ నుంచి కేసీఆర్, బి.వినోద్, బండి సంజయ్‌లు ఎంపీలుగా గెలిచి ఏం సాధించారు? అదే 2009లో పొన్నం ప్రభాకర్‌ను ఒక్కసారి ఎంపీగా గెలిపిస్తే.. తెలంగాణ తెచ్చి చూపించారు. తెలంగాణ బిల్లు పెట్టిన రోజున సమైక్యవాదులు స్పీకర్ కళ్లలో కారం కొట్టి బిల్లును ఆపాలని చూసినా.. జైపాల్‌రెడ్డి వ్యూహం, తెలంగాణ ఎంపీల తెగువతో బిల్లు ఆమోదం పొందింది. కానీ తల్లిని చంపి, బిడ్డను బతికించారంటూ ప్రధాని మోదీ తెలంగాణ ఆవిర్భావాన్ని అవహేళన చేశారు. ఆయనకు ఎలా ఓటేస్తారు?" అని రేవంత్ ప్రశ్నించారు. తెలంగాణ మనుగడ కోసం విభజన చట్టంలో బయ్యారం ఉక్కు పరిశ్రమ, ఐటీఐఆర్ ప్రాజెక్టు, కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ, గిరిజన వర్సిటీ, ఐఐటీ వంటివాటిని చేర్చితే.. అవేమీ అమలుకు నోచుకోలేదన్నారు. సీఎం కేసీఆర్ 3 వేల వైన్ షాపులు, 60వేల బెల్టుల షాపులతో తెలంగాణను తాగుబోతుల రాష్ట్రంగా మార్చారని ఆరోపించారు. మోసపూరిత గుజరాత్ మోడల్ కావాలో, తాగుబోతుల తెలంగాణ మోడల్ కావాలో, రైతులు-యువత అభ్యున్నతికి ఛత్తీస్‌గఢ్ మోడల్ కావాలో ప్రజలు ఆలోచించుకోవాలని పిలుపునిచ్చారు.

బలహీన వర్గాల కోసమే తెలంగాణ: మాణిక్‌రావ్ ఠాక్రే

ఎస్సీ, ఎస్టీ, ఆదివాసీ, బీసీల అభ్యున్నతి కోసమే సోనియాగాంధీ ప్రత్యేక తెలంగాణ రాష్ట్రాన్ని ఏర్పాటు చేశారని, కానీ గత 8 ఏళ్లలో ఈ ఆకాంక్షలేవీ నెరవేరలేదని మాణిక్‌రావు ఠాక్రే పేర్కొన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ కార్యకర్తలపై దాడులు పెరిగాయని ఆరోపించారు.

కేసీఆర్‌ను ఓడించాలి: జైరాం రమేశ్

ఛత్తీస్‌గఢ్ మోడల్‌లో రైతుల జీవితాల్లో వెలుగులు కనిపిస్తున్నాయని.. దానిని తెలంగాణలో అమలు చేయాలని జైరాం రమేశ్ పేర్కొన్నారు. "కేసీఆర్ నిజాంలా నిరంకుశంగా వ్యవహరిస్తున్నారు. కేసీఆర్ హఠావో.. తెలంగాణ బచావో" అని పిలుపునిచ్చారు.

ఆదిశంకరాచార్య తర్వాత రాహుల్ గాంధీనే: ఉత్తమ్

ఆది శంకరాచార్య తర్వాత దేశమంతా తిరిగిన వ్యక్తి రాహుల్ గాంధీ మాత్రమేనని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. విద్వేషాన్ని విడిచి దేశ సమైక్యతను కాపాడాలని రాహుల్ సందేశం ఇచ్చారన్నారు. తెలంగాణలో వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని చెప్పారు.

సామాజిక తెలంగాణ ఏర్పడలేదు: మల్లు భట్టివిక్రమార్క

ప్రజలు కోరుకున్న సామాజిక తెలంగాణ ఏర్పడలేదని, ప్రాణహితకు అంబేద్కర్ పేరును తొలగించారని భట్టి విక్రమార్క చెప్పారు. రూ.లక్ష కోట్లు ఖర్చు చేసి కాళేశ్వరం ద్వారా ఒక్క ఎకరాకు నీళ్లు ఇవ్వలేకపోయారని, కాంగ్రెస్ హయాంలో కట్టిన ప్రాజెక్టుల నీటితోనే పంటలు పండుతున్నాయని పేర్కొన్నారు. భూమి లేని నిరుపేదలకు ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం రూ.7 వేలు ఇస్తోందని.. కానీ ఇక్కడ బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఏమీ ఇవ్వడం లేదని విమర్శించారు.

బీఆర్‌ఎస్‌కు వనపర్తి జెడ్పీ చైర్మన్ రాజీనామా

ఇద్దరు ఎంపీపీలు, 11 మంది సర్పంచ్‌లు..
- ఆరుగురు ఎంపీటీసీ సభ్యులు, ఒక సింగిల్ విండో డైరెక్టర్..
- పలువురు ఉప సర్పంచ్‌లు, మాజీ ప్రజాప్రతినిధులు సైతం అదేబాటలో
- సల్కెలాపూర్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో వెల్లడి
- ఆత్మాభిమానం చంపుకోలేకనన్న నేతలు
- మంత్రి నిరంజన్‌రెడ్డికి షాక్

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి ఇలాకా వనపర్తి జిల్లాలో భారత రాష్ట్ర సమితి (బీఆర్‌ఎస్)లో ముసలం మొదలైంది. మంత్రికి సన్నిహితులుగా పేరొందిన ముఖ్య నాయకులు సైతం పార్టీకి రాజీనామా చేశారు. జిల్లా పరిషత్ చైర్మన్ ఆర్.లోక్‌నాథ్ రెడ్డితోపాటు వనపర్తి, పెద్దమందడి ఎంపీపీలు మేఘారెడ్డి, కిచ్చారెడ్డి, సింగిల్ విండో మాజీ అధ్యక్షుడు ఐ.సత్యారెడ్డి, సింగిల్ విండో డైరెక్టర్ సాయిచరణ్‌రెడ్డి రాజీనామా చేసిన వారిలో ఉన్నారు. ఈ మేరకు ఖిల్లాఘనపురం మండలం సల్కెలాపూర్ గ్రామంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు పత్రాలు ప్రదర్శించారు. వీరితోపాటు మరో 11 మంది సర్పంచ్‌లు, ఆరుగురు ఎంపీటీసీ సభ్యులు, పలువురు ఉపసర్పంచ్‌లు, మాజీ ప్రజాప్రతినిధులు రాజీనామా చేస్తున్నట్లు స్వయంగా ప్రకటించడమే కాకుండా బీఆర్‌ఎస్ లో తాము ఎదుర్కొన్న బాధలను వెళ్లగక్కారు.

ఆత్మగౌరవాన్ని తాకట్టు పెట్టలేక..: ఈ సందర్భంగా జెడ్పీ చైర్మన్ లోక్‌నాథ్‌రెడ్డి మాట్లాడుతూ మామూలు కార్మికులు సైతం ఆత్మగౌరవం కోరుకుంటారని.. అలాంటిది అధికారంలో ఉండి కూడా ఆత్మగౌరవాన్ని పొందలేకపోయామని ఆవేదన వ్యక్తం చేశారు. బీఆర్‌ఎస్‌లో ఆత్మగౌరవాన్ని తాకట్టు పెట్టలేకే రాజీనామా చేసినట్లు వెల్లడించారు.

నిరంజన్‌రెడ్డికి పేరొచ్చిందంటే మేమే కారణం

పెద్దమందడి ఎంపీపీ మేఘారెడ్డి మాట్లాడుతూ మంత్రి నిరంజన్‌రెడ్డికి నీళ్ల నిరంజన్‌రెడ్డి అనే పేరు వచ్చేందుకు తమ శ్రమే కారణమన్నారు. ఈ ప్రాంతానికి నీళ్లు తెచ్చింది ఎవరో వారి మనసులో ఉందని.. త్వరలోనే వారు బాహాటంగా చెప్పే రోజులు వస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. నియంత పాలన అంతం కోసం ఇక నుంచి పెద్ద ఎత్తున పోరాటం చేస్తామని చెప్పారు. కాగా, నియోజకవర్గంలో ఇప్పటివరకు తిరుగులేని నాయకుడిగా పేరు తెచ్చుకున్న మంత్రి నిరంజన్ రెడ్డికి అతడి సొంత సెగ్మెంట్ నుంచే వ్యతిరేకత పెల్లుబికడంతోపాటు తాజా పరిణామాలు ఎదురుదెబ్బేనని రాజకీయ వర్గాల్లో చర్చ జోరుగా సాగుతోంది.

కలుషితాహారంతో 70 మంది విద్యార్థినులకు అస్వస్థత

- మహబూబాబాద్‌లోని కస్తూర్బాగాంధీ విద్యాలయంలో ఘటన
- ఆందోళన చెందొద్దని రాష్ట్ర మంత్రి సత్యవతి భరోసా

నెహ్రూసెంటర్/మహబూబాబాద్ అర్బన్: మహబూబాబాద్ జిల్లాకేంద్రంలోని కస్తూర్బాగాంధీ విద్యాలయంలో కలుషితాహారం కారణంగా 70 మంది విద్యార్థినులు అస్వస్థతకు గురయ్యారు. బుధవారంరాత్రి విద్యార్థినులు టమాట కూర, సాంబారు, మజ్జిగతో భోజనం చేశారు. ఆ తర్వాత కొద్దిసేపటికే కొంతమంది విద్యార్థినులకు కడుపునొప్పి, వాంతులు, విరేచనాలు అయ్యాయి. దీంతో పాఠశాలలో ఏఎన్‌ఎం, స్పెషల్ ఆఫీసర్ మందులు అందించారు. గురువారం ఉదయం బాధిత విద్యార్థినులకు గ్లూకోజ్, ఓఆర్‌ఎస్ కలిపి తాగించారు. అయినా వారికి వాంతులు, విరేచనాలు అవుతుండటంతో తొలుత పాఠశాలలోనే వైద్యులతో వైద్యం అందించారు. పరిస్థితి విషమించడంతో 36 మందిని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించారు. వారిలో కొందరికి ఆక్సిజన్ పెట్టారు. మరో 34 మంది విద్యార్థినులను హాస్టల్ గదుల్లోనే నేలపై పడుకోపెట్టి చికిత్స అందిస్తున్నారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నవారికి ఎలాంటి ప్రాణాపాయం లేదని వైద్యులు తెలిపారు. దీనిపై కేజీబీవీ ఎస్‌వో భవానిని వివరణ కోరగా బుధవారంరాత్రి ఆరుగురు విద్యార్థినులకు కడుపునొప్పి, వాంతులు కావడంతో మందులు వేశామని, ఉదయం మరి కొంత మందికి అదే పరిస్థితి ఎదురుకావడంతో జిల్లా విద్యాశాఖ ఉన్నతాధికారులకు సమాచారం అందించామన్నారు. విద్యార్థినులను ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నామని తెలిపారు.



ఆక్సిజన్ వార్డులో చికిత్స పొందుతున్న విద్యార్థినులు

విద్యార్థినుల ఆరోగ్యంపై మంత్రి ఆరా..

కస్తూర్బాగాంధీ విద్యాలయంలో కలుషితాహారం విషయం తెలియగానే జిల్లా కలెక్టర్, జిల్లా విద్యాశాఖ అధికారితో రాష్ట్ర గిరిజన, స్త్రీ, శిశు సంక్షేమశాఖల మంత్రి సత్యవతి రాథోడ్ ఫోన్‌లో మాట్లాడి విద్యార్థుల పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు. విషయం తెలుసుకున్న ఎంపీ మాలోత్ కవిత, ఎమ్మెల్యే బానోత్ శంకర్ నాయక్, ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావులు ఆస్పత్రికి చేరుకుని విద్యార్థినులను పరామర్శించారు.

అవినీతి వల్లనే 'వీఆర్వో' వ్యవస్థ రద్దు

హైకోర్టులో రాష్ట్ర ప్రభుత్వ వాదనలు

సాక్షి, హైదరాబాద్: క్షేత్రస్థాయిలో విపరీతంగా అవినీతి పెరిగిపోయిన కారణంగానే వీఆర్వో వ్యవస్థను రద్దు చేశామని హైకోర్టులో రాష్ట్ర ప్రభుత్వం వాదనలు వినిపించింది. వందల మంది వేరే డిపార్ట్‌మెంట్లలో చేరారని, కేవలం 60 మంది మాత్రం రెవెన్యూ విభాగంలోనే కొనసాగించాలని కోరడం సరికాదని పేర్కొంది. రెవెన్యూశాఖలో ఖాళీలున్నా తమను ఇతర శాఖల్లోకి పంపడం అన్యాయమని పేర్కొంటూ వీఆర్వోలు హైకోర్టులో పలు పిటిషన్లు దాఖలు చేశారు. ఈ పిటిషన్లపై గతంలో విచారణ చేపట్టిన సీజే ధర్మాసనం వీఆర్వోలను ఇతర శాఖలకు తరలించడంపై స్టే విధించింది. ఈ పిటిషన్లపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భూయాన్, జస్టిస్ తుకారాంజీ ధర్మాసనం గురువారం మరోసారి విచారణ జరిపింది. రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఏజీ వాదనలు వినిపించారు. 'రాష్ట్ర ప్రభుత్వానికి ఉన్న అధికారాలతోనే వీఆర్వోలను ఇతర శాఖల్లో సర్దుబాటు చేయడానికి మార్గదర్శకాలు జారీచేసింది' అని పేర్కొన్నారు. తదుపరి విచారణ కోసం వాదనలను మార్చి 20వ తేదీకి ధర్మాసనం వాయిదా వేసింది.

జిల్లా వార్తలు

రాష్ట్ర చెస్ జట్టు కెప్టెన్‌గా పూర్ణచందర్‌రావు



సింగరేణి(కొత్తగూడెం): ఆలిండియా స్థాయి ఉద్యోగుల చెస్ టోర్నమెంట్‌లో తెలంగాణ చెస్ జట్టు కెప్టెన్‌గా డాక్టర్ పూర్ణచందర్‌రావును ప్రభుత్వం నియమించింది. ఈ పోటీలు భువనేశ్వర్‌లో ఈనెల 12, 13, 14వ తేదీల్లో జరగనున్నాయి. ఉద్యోగుల రాష్ట్ర స్థాయి టోర్నీ గత ఏడాది సెప్టెంబర్‌లో జరగగా ప్రథమ స్థానం సాధించిన కొత్తగూడెంలోని రామచంద్ర కాలేజీ ప్రొఫెసర్ పూర్ణచందర్‌రావును తెలంగాణ జట్టు కెప్టెన్‌గా నియమించారు. ఈ సందర్భంగా ఆయనను భద్రాద్రి జిల్లా క్రీడాశాఖాధికారి సీతారాం, చెస్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు సాంబశివరావు, కే.ఎస్.ప్రసాద్ రావు తదితరులు అభినందించారు.

బ్యాడ్మింటన్ గ్రేడ్-1 అంపైర్‌గా మల్లికార్జున్



కొణిజర్ల: జాతీయ స్థాయి బ్యాడ్మింటన్ పోటీలకు గ్రేడ్-1 అంపైర్‌గా కొణిజర్ల మండలం తనికెళ్లకు చెందిన తుప్పతి మల్లికార్జున్ ఎంపికయ్యాడు. ఇటీవల ఒడిశా రాష్ట్రం భువనేశ్వర్‌లో బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యాన నిర్వహించిన పరీక్షలో ఉత్తీర్ణుడైన మల్లికార్జున్‌ను గ్రేడ్-1 అంపైర్‌గా ఎంపిక చేస్తూ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. కాగా, తెలంగాణలో ఈ ఘనత సాధించిన మూడో వ్యక్తిగా, ఖమ్మం జిల్లా నుంచి మొదటి వ్యక్తి ఆయన నిలిచారు. ఈ సందర్భంగా మల్లికార్జున్‌ను తెలంగాణ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు గంటా వెంకట్రావు, సభ్యులు నల్లమోతు రఘు, డాక్టర్ సత్యనారాయణమూర్తి, బాలసాని ఆనంద్, పాటిబండ్ల యుగేందర్, పీడీలు రమణ, రామారావు, శ్రీను అభినందించారు.

గురుకుల డిగ్రీ కళాశాలలో ప్రవేశానికి 12న పరీక్ష

కొణిజర్ల: కొణిజర్ల మండలం తనికెళ్లలోని తెలంగాణ గిరిజన బాలికల గురుకుల డిగ్రీ కళాశాలలో ప్రవేశాల కోసం ఈనెల 12న పరీక్ష నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ వి.ఉమాదేవి తెలిపారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న, పూర్తిచేసిన గిరిజన బాలికలు ఈ పరీక్ష రాయడానికి అర్హులని పేర్కొన్నారు. కళాశాలలోనే ఉదయం 10నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పరీక్ష జరుగుతుందని విద్యార్థినులు గంట ముందుగానే కేంద్రానికి చేరుకోవాలని సూచించారు. పూర్తి వివరాల కోసం 94910 63083 నంబర్‌ను సంప్రదించాలని ఆమె తెలిపారు.

తాలు మిర్చి తక్కువేం కాదు!



ఖమ్మం మార్కెట్‌కు విక్రయానికి తీసుకొచ్చిన తాలుమిర్చి బస్తాలు

- మునుపెన్నడూ లేని విధంగా డిమాండ్
- క్వింటాకు రూ.13 వేలకు పైగా పలుకుతున్న ధర
- కొనుగోళ్లకు ఆయిల్ పరిశ్రమల ఆసక్తి

ఖమ్మంవ్యవసాయం: తాలు మిర్చి అనగానే పెద్దగా అవసరం లేనిది.. అంతగా కొనుగోలు చేయనిది... ధర కూడా ఏదో నామమాత్రంగా ఉంటుందనే భావన సహజం. కానీ ఈ ఏడాది తాలు మిర్చికి డిమాండ్ వచ్చింది. ప్రస్తుతం తాలు మిర్చి ధర క్వింటాకు రూ.13 వేలకు పైగా పలుకుతోంది. ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో గురువారం తాలుమిర్చికి గరిష్ట ధర రూ.13,200గా నమోదైంది. ఎర్రమిర్చి ధరతో పోలిస్తే నాలుగో వంతు ధర కూడా తాలు మిర్చికి దక్కదు. పదేళ్ల క్రితం ఎర్రమిర్చి ధర రూ.10 వేల వరకు పలకగా తాలు మిర్చి ధర కేవలం రూ.వెయ్యి దాటలేదు. కానీ గత ఏడాది నుంచి తాలు మిర్చికి గిరాకీ పెరిగింది. ఈ ఏడాది మిర్చి సీజన్ ఆరంభంలో క్వింటా రూ.10వేల వరకు తాలు మిర్చి ధర పలకగా, ప్రస్తుతం పెరిగింది. ఎర్రమిర్చి ధర పెరిగిన కొద్దీ తాలు మిర్చికి కూడా డిమాండ్ పెరుగుతోంది. ఈ ధర గత నెల రూ.12వేలకు చేరగా, ఇప్పుడు రూ.13వేలు దాటడం విశేషం. ఎర్రమిర్చి ధరలో హెచ్చుతగ్గులున్నా తాలు మిర్చి డిమాండ్ తగ్గకపోవడం.. వ్యాపారులు తాలు మిర్చి కోసం ఆరా తీస్తుండడం మార్కెట్‌లో కనిపిస్తోంది.

ఆయిల్ పరిశ్రమల్లో డిమాండ్

వివిధ దేశాల్లో మిర్చి ఆయిల్ వినియోగాన్ని దృష్టిలో పెట్టుకుని జిల్లాలో ఆయిల్ పరిశ్రమలు నెలకొల్పారు. ఖమ్మం జిల్లా ముదిగొండ మండలం, మహబూబాబాద్ జిల్లాలోని కురవి మండలం మన్నెగూడెం, మరిపెడ మండలంలో బంగ్లా తదితర ప్రాంతాల్లో ఆయిల్ పరిశ్రమలు ఉన్నాయి. ఈ పరిశ్రమల బాధ్యులు గత ఏడాది వరకు ఎర్రమిర్చిని కొనుగోలు చేసే ఆయిల్‌ను ఉత్పత్తి చేసేవారు. కానీ ఇప్పుడుఎర్రమిర్చి ధర పెరగటంతో తాలు వైపు మొగ్గు చూపుతున్నారు. తాలు మిర్చి నుంచి కూడా ఆయిల్ శాతం అధికంగానే వస్తుండడంతో కొనుగోళ్లు పెంచగా, వీరికి తోడు దేశీయంగా వినియోగించే కారంలో తాలుమిర్చి కారం కలుపుతుండడంతో ధరకు రెక్కలొచ్చాయి.

కొనుగోళ్లు పెరిగాయి



మిర్చి ఆయిల్ పరిశ్రమల బాధ్యులు తాలుమిర్చికి ప్రాధాన్యం ఇస్తున్నారు. ఎర్రమిర్చి ధర ఎక్కువగా ఉండడం, తాలు మిర్చి నుంచి కూడా ఆయిల్ శాతం ఆశాజనకంగా ఉండడంతో ఈ పరిస్థితి నెలకొంది. ఖమ్మం పరిసర ప్రాంతాల్లోని పరిశ్రమలతో పాటు హైదరాబాద్, ఒంగోలు నుంచి కూడా ఆర్డర్లు వస్తుండడంతో డిమాండ్ పెరిగింది. – మలిశెట్టి వెంకటేశ్వర్లు, వ్యాపారి, ఖమ్మం వ్యవసాయ మార్కెట్

ఉద్యోగుల సంక్షేమానికి పెద్దపీట



టీఎన్జీవోస్ డైరీ, క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న మంత్రి పువ్వాడ, సంఘం బాధ్యులు

టీఎన్జీవోస్ డైరీ, క్యాలెండర్లు ఆవిష్కరించిన మంత్రి పువ్వాడ

ఖమ్మం స్పోర్ట్స్: ఉద్యోగుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ తెలిపారు. దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణలో ఉద్యోగులకు వేతనాలు ఇస్తూ ఇతర సౌకర్యాలు కల్పిస్తుండడమే ఇందుకు నిదర్శనమని చెప్పారు. టీఎన్జీవోస్ ఆధ్వర్యాన రూపొందించిన డైరీ, క్యాలెండర్లను ఖమ్మంలో ఆయన టీఎన్జీవోస్ కేంద్ర కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు మామిళ్ల రాజేందర్, రాయకంటి ప్రతాప్‌తో కలిసి ఆవిష్కరించారు. అలాగే, మహిళా దినోత్సవం సందర్భంగా నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం మంత్రి పువ్వాడ మాట్లాడుతూ టీఎన్జీవోస్ ఫంక్షన్ హాల్ మరమ్మతుల కోసం తన నిధుల నుంచి రూ.25 లక్షలు కేటాయిస్తున్నట్లు ప్రకటించారు. టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు అఫ్జల్ హసన్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మేయర్ పునుకొల్లు నీరజ, సుడా చైర్మన్ విజయ్‌కుమార్, టీఎన్జీవోస్ జిల్లా కార్యదర్శి ఆర్.వీ.ఎస్.సాగర్, మహిళా విభాగం అధ్యక్ష, కార్యదర్శులు శాబాసు జ్యోతి, ఈ.స్వప్నతో పాటు ముత్యాల సత్యనారాయణ, ఖాజామియా, సునీల్‌రెడ్డి, నందగిరి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ అభ్యర్థులను సత్కరించిన మంత్రి

ఖమ్మంమయూరిసెంటర్: ఎమ్మెల్యే కోటాలో ఎంపిక చేసిన బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థులు అభ్యర్థులు నవీన్‌కుమార్, దేశపతి శ్రీనివాస్, చల్లా వెంకట్రాంరెడ్డి గురువారం నామినేషన్లు దాఖలు చేశారు. ఈ సందర్భంగా వీరిని రాష్ట్ర మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ హైదరాబాద్‌లో సత్కరించారు.

ఎక్కడా నాణ్యత తగ్గొద్దు..



లడ్డూల తయారీని పరిశీలిస్తున్న ఈఓ రమాదేవి

'నవమి' ఏర్పాట్ల పరిశీలనలో ఈఓ రమాదేవి

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామ చంద్ర స్వామి ఆలయంలో జరగనున్న కల్యాణ బ్రహ్మోత్సవాలకు సంబంధించి చేపడుతున్న పనుల్లో ఎక్కడా నాణ్యత లోపించొద్దని, ఏమైనా అవకతవకలు జరిగితే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఈఓ రమాదేవి హెచ్చరించారు. గురువారం ఆమె ఆలయ పరిసర ప్రాంతాల్లో జరుగుతున్న నవమి ఏర్పాట్లు, యాగశాల నిర్మాణాలను పరిశీలించారు. అనంతరం లడ్డూ తయారీ విభాగంలో కూడా తనిఖీ చేశారు. భక్తులకు స్వచ్ఛమైన, నాణ్యమైన ప్రసాదాలు అందించాలని, లడ్డూలు పాడైపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కాలం ముగిసిన ప్రసాదాలను ఎట్టి పరిస్థితుల్లో అమ్మొద్దని ఈఓ తెలిపారు. అనంతరం స్టాక్ రిజిస్టర్లను పరిశీలించి సిబ్బందికి సలహాలు, సూచనలు చేశారు. ఆమె వెంట రామాలయ ఈఈ రవీందర్, సీసీ అనిల్ తదితరులు పాల్గొన్నారు.

సౌత్‌జోన్ ఇంటర్ వర్సిటీ పోటీలకు కేయూ జట్లు



జిమ్నాస్టిక్స్ జట్లతో కేయూ స్పోర్ట్స్‌బోర్డు సెక్రటరీ సవితాజ్యోత్స్న



చెస్ క్రీడాకారులతో సవితాజ్యోత్స్న

కేయూ క్యాంపస్: చండీగఢ్‌లోని పంజాబ్ యూనివర్సిటీలో ఈనెల 10నుంచి 14వ తేదీ వరకు ఇంటర్ యూనివర్సిటీ జిమ్నాస్టిక్స్(పురుషుల, మహిళల) పోటీలు జరగనున్నాయి. ఈమేరకు కేయూ జట్లను ఎంపిక చేసినట్లు స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీ డాక్టర్ సవితాజ్యోత్స్న గురువారం తెలిపారు. పురుషుల విభాగంలో కె.కృష్ణాచారి, పి.సూర్యదేవ్, సీహెచ్.ప్రవీణ్‌కుమార్, డి.మోహన్‌కుమార్, ఎండీ ఉమ్‌అలీ, ఆర్టిస్టిక్స్ జిమ్నాస్టిక్స్ మహిళల విభాగంలో ఎల్.ప్రేమలత, ఎల్.శిరీష, రిథమిక్ జిమ్నాస్టిక్స్‌లో శ్రీసాయిభవ్యను ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. ఆయా జట్లకు మేనేజర్‌గా జేఎస్‌ఎస్ కోచ్ విజయకుమార్ వ్యవహరిస్తారని సవితాజ్యోత్స్న తెలిపారు. అలాగే, చెన్నైలోని ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో ఈనెల 10నుంచి 12వ తేదీ వరకు జరిగే సౌత్‌జోన్ ఇంటర్ యూనివర్సిటీ చెస్ పోటీలకు సైతం కేయూ క్రీడాకారులను ఎంపిక చేశారు. వీరిలో బి.రామచందర్, జి.కార్తీక్, ఎస్.అఖిల్, ఎ.తరుణ్, జె.ఉపేందర్, ఓ.రంజిత్ ఉండగా, మేనేజర్‌గా మహబూబాబాద్ విజ్ఞానభారతి కళాశాల పీడీ కె.రమేష్ వ్యవహరిస్తారని సవితాజ్యోత్స్న తెలిపారు.

సింగరేణి ఆస్తులు, స్థలాలను కాపాడాలి

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణికి చెందిన ఆస్తులు, స్థలాలను కాపాడడంపై జనరల్ మేనేజర్లు, ఎస్టేట్, సెక్యూరిటీ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సింగరేణి డైరెక్టర్(పా) ఎన్.బలరాం ఆదేశించారు. కొత్తగూడెంలోని సింగరేణి ప్రధాన కార్యాలయం నుంచి ఆయన గురువారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అధికారులతో మాట్లాడారు. స్థలాల పరిరక్షణకు ఎంత ఖర్చయినా సరే కంచెలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈమేరకు అధికారులు సమన్వయంతో పనిచేస్తూ పర్యవేక్షించాలని సూచించారు. డైరెక్టర్(ఆపరేషన్స్) ఎన్వీకే.శ్రీనివాస్ మాట్లాడుతూ సింగరేణి ఆస్తుల పరిరక్షణలో సెక్యూరిటీ అధికారులు కఠినంగా వ్యవహరించాలని తెలిపారు. ఈ సమావేశంలో జీఎంలు బి.హన్మంతరావు, కట్టా బసవయ్య, రవిప్రసాద్, చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ శశిధర్‌రాజుతో పాటు రామకృష్ణ, కోదూరి శ్రీనివాస్, వేణుమాధవ్, జాకీర్ హుస్సేన్, ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.



వీసీలో మాట్లాడుతున్న డైరెక్టర్లు బలరాం, శ్రీనివాస్